క్లుప్తంగా

తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని, పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం వందరోజుల ప్రణాళికలో భాగంగా తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో పట్టణాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దాలన్నారు. కమిషనర్ స్పందన మాట్లాడుతూ పౌరుల సహకారం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని, తడి, పొడి చెత్తపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, మాజీ కౌన్సిలర్లు మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే దంపతులు

జగిత్యాలరూరల్: మండలంలోని అంతర్గాం గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన మహాలక్ష్మీ ఆలయంలో మంగళవారం మహాలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి రాజేశంగౌడ్ కూడా పూజల్లో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వార్డుల్లో అవగాహన కల్పిస్తున్న కమిషనర్

కోరుట్ల: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ అంది మారుతీ ప్రసాద్ అన్నారు. 100 ప్రణాళికల్లో భాగంగా మంగళవారం హెల్త్ ,ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పట్టణంలో పలు వార్డులు సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఫిల్టర్‌బెడ్, సర్వర్ నగర్‌లోని పెద్ద డ్రైయినేజీని పరిశీలించారు. తడి పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ బండికి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, అశోక్, ఇంజినీర్ మహేష్, హెల్త్ సూపర్‌వైజర్ ధనుంజయ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న గీత కార్మికులు

ఇబ్రహీంపట్నం: గీత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను మంగళవారం గీత కార్మికులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు వేర్వేరుగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా నాయకులు చెట్ల చంద్రశేఖర్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్లపల్లి సత్యనారాయణగౌడ్, మండల అధ్యక్షుడు భూసారపు సాయిరాంగౌడ్, గీత కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు నేరేళ్ల సుభాష్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కోరుట్ల రూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఓదెల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మురుగు నీళ్ల నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. ప్రతీ మంగళ, శుక్ర వారాలు డ్రై డే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సమీనా, మండల పంచాయతీ అధికారి కృపాకర్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు ఇసుక దంపులకు వేలం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామ శివారులో సీజ్ చేసిన ఇసుక డంపులకు నేడు వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 142 ట్రిప్పుల ఇసుక ఉందని,వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేలు దరావత్తు చెల్లించాలని సూచించారు.ఇసుక డంపుల వద్దే వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



యూసుఫ్‌నగర్‌లో జనావాసాల మధ్య చెత్త



మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

అస్తవ్యస్తంగా పారిశుధ్యం..

- యూసుఫ్‌నగర్‌లో కంపుకొడుతున్న కాలనీలు
- జనావాసాల మధ్య చెత్తాచెదారం
- అధికారుల నిర్లక్ష్యం

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో పారిశుధ్య పడకేసింది. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి కంపు కొడుతున్నాయి. జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలంలోనే చెత్త పారవేస్తున్నారు. పారిశుధ్యం నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. గ్రామ చివరలో నిర్మించిన ఇంకుడు గుంతకు డ్రెయినేజీ నీళ్లు వెళ్లక నిరుపయోగంగా మారింది.

యూసుఫ్‌నగర్‌లో మూడు వేల జనాభా ఉండగా, ముగ్గురు సఫాయి కార్మికులు ఒక డ్రైవర్ విధులు నిర్వహిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువై డ్రెయినేజీల్లో చెత్త తొలగించక పేరుకుపోయి కంపు కొడుతున్నాయి. ప్రాథమిక పాఠశాల వద్ద ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో చెత్త పారవేస్తున్నారు. అయిలాపూర్ వెళ్లే చౌరస్తా వద్ద డ్రెయినేజీ కాల్వలో చెత్త, ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లతో నిండి నీళ్లు వెళ్లక ప్రయాణికులకు కంపు కొడుతుంది. అయిలాపూర్ రోడ్డులో నిర్మించిన ఇంకుడు గుంత పగిలిపోయి నిరుపయోగంగా మారింది. వర్షాకాలం వస్తుండటంతో ఎప్పటికప్పుడు చెత్త తొలగిస్తే దోమల బెడదతో పాటు సీజనల్ వ్యాదులు ప్రబలకుండా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఎంపీవో కృపాకర్ ను వివరణ కోరగా, డ్రెయినేజీలు శుభ్రం చేయించి పారిశుధ్యం నిర్వహణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చెత్తతో నిండిన డ్రెయినేజీ



జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్యం పడకేసిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ పరిసరాల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో బస్టాండ్ పరిసరాలు కంపుకొడుతున్నాయి. పందుల స్వైరవిహారంతో బస్టాండ్ ఆవరణ అంతా దుర్గంధం వ్యాపిస్తోంది. క్రమం తప్పకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, పందులు, పశువులు బస్టాండ్ పరిసరాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కల్పన,డిపో మేనేజర్, జగిత్యాల, సెల్ నం: 9959225925, 9959224527

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి





మేడిపల్లి: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత వీవీరావుపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

జగిత్యాలరూరల్/కోరుట్లరూరల్/రాయికల్/మల్లాపూర్/సారంగాపూర్/పెగడపల్లి/మల్యాల/కథలాపూర్/మేడిపల్లి: భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతిని ప్రవేశపెట్టిందని తహసీల్దార్లు అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభించారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో జగిత్యాల తహసీల్దార్ రాంమోహన్, మల్లాపూర్ మండలంలోని వీవీరావుపేట, వాల్గొండ గ్రామాల్లో తహసీల్దార్ రమేశ్ గౌడ్,కోరుట్ల మండలంలోని నాగులపేట, సంగెం గ్రామాల్లో తహసీల్దార్ కృష్ణ చైతన్య, రాయికల్ మండలం కుమ్మరిపల్లి, తాట్లవాయి గ్రామాల్లో తహసీల్దార్ గణేశ్, సారంగాపూర్ మండలంలోని బట్టపల్లిలో తహసీల్దార్ వహిదొద్దీన్, బీర్‌పూర్‌లో తహసీల్దార్ సుజాత, పెగడపల్లి మండలంలోని నర్సింహునిపేట, దీకొండ గ్రామాల్లో తహసీల్దార్ రవీందర్, మల్యాల మండలంలోని గొర్రెగుండం, సర్వాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ వసంత, కథలాపూర్ మండలంలోని ఊట్‌పెల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో తహసీల్దార్ వినోద్, మేడిపల్లి మండలలో వల్లంపల్లి, భీమారం మండలం రంగాపూర్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లత, తహసీల్దార్లు మునిందర్, రవికిరణ్ భూసమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల ఇబ్బందులను దూరం చేసేందుకే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. భూ రికార్డుల ఆధారంగా వివాదాలు లేకుండా సర్వే చేసి భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు పరిశీలన

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేటలో మంగళవారం నిర్వహించిన భూ భారతీ రెవెన్యూ సదస్సును జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడారు. ఆమె వెంట కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి ఉన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ప్రసిద్ధిగాంచిన వెల్లుల్ల ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం జరిగిన జాతర సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు బారులుదీరారు. ఉదయం నుంచి ఆలయమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ అధికారులు, పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం కల్పించారు. ఆలయానికి రూ.1.15 లక్షల ఆదాయం, మిశ్రమ వెండి 8 గ్రాములు సమకూరిందని అధికారులు తెలిపారు.

ఘనంగా మురళీకృష్ణ ఆలయ వార్షికోత్సవం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

మెట్‌పల్లి: పట్టణంలోని మురళీకృష్ణ ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి, గౌరీ ఆరాధన, పుణ్యావచనం, రక్షా బంధనం తదితర పూజలతో పాటు అష్టోత్తర శత కలశాభిషేకం, సత్సంగ కార్యక్రమాలు, మధ్యాహ్నం పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు ఉత్తమ సేవలందిస్తాం

కథలాపూర్: మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు మరింత సేవలందిస్తామని కథలాపూర్ ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు. మార్కెట్ కమిటీ నిధులతో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని నిర్ణయించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషా, కార్యదర్శి రమణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

హరీశ్ రావు జన్మదిన వేడుకలు

మెట్‌పల్లి: మాజీ మంత్రి హరీశ్ రావు జన్మదిన వేడుకలను మంగళవారం పట్టణంలో టీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓజ్జెల శ్రీనివాస్, శివచరణ్, గంగరాజం, స్వరాజ్, అరుణ్, శేఖర్, క్రాంతి, శ్రీధర్ తదితరులున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని బ్రాహ్మణ సంఘం భవనంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సమావేశం ఏర్పాటు చేయగా, విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ బలంగా ఉంటేనే మనం బలంగా ఉంటామని, కార్యకర్త, నాయకుడు పార్టీ బలోపేతం కోసం చేస్తున్న కృషిని అధిష్టానం గుర్తిస్తుందన్నారు. ఇందుకు ప్రతీ కార్యకర్త పార్టీ మరింత బలపడేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు కత్తి వెంకటస్వామి, వైద్యుల అంజన్‌కుమార్, నాయకులు ఎస్.దినేశ్, చీపిరిశెట్టి రాజేశ్, కుంట సుధాకర్, చిలుముల లక్ష్మణ్, శైలేందర్‌రెడ్డి తదితరులున్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రొసీడింగ్స్ అందిస్తున్న నర్సింగరావు,నాయకులు

మెట్‌పల్లిరూరల్/ఇబ్రహీంపట్నం: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్, జగ్గాసాగర్ గ్రామాలు, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మంగళవారం ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీలు నెరవేరుస్తుందన్నారు. స్థలం లేని వారందరికీ రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఇళ్లు రానివారు నిరాశ పడవద్దని అన్నారు. అనంతరం విట్టంపేటలో భూభారతి గ్రామసభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, లింగారెడ్డి, తిరుపతిరెడ్డి, రవి, కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సునీల్ మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటు

ధర్మపురి: బీఆర్ఎస్ నాయకుడు అక్కెనపెల్లి సునీల్ కుమార్ అకాల మరణం పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బల్‌రాంరెడ్డి, ఓరుగంటి రమణారావు అన్నారు. ధర్మపురిలో కర్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సునీల్ కుమార్ సంతాప సభకు హాజరై మాట్లాడారు. పేదల పక్షపాతిగా ఉంటూ ఎంతోమందికి సహాయ సహకారాలందిచిన గొప్ప మనసున్న వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, ఏఎంసీ చైర్మన్లు హాజరయ్యారు.

పీఎం విశ్వకర్మ యోజన కిట్ల పంపిణీ

రాయికల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశ్వకర్మ యోజన పథకం కింద 200 మంది లబ్ధిదారులకు మంగళవారం మంజూరైన కిట్లను సబ్ పోస్టుమాస్టర్ రాజు చేతుల మీదుగా బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, లబ్ధిదారులు గుండోజి లక్ష్మీనారాయణ, సంకోజి శేఖర్, గుండోజి రవీందర్, గుండోజి గంగాధర్ పాల్గొన్నారు.

సేవాలాల్‌మహారాజ్ ఉత్సవాలు

మల్లాపూర్: బంజారాల స్ఫూర్తి ప్రధాతలు, ఆరాధ్య దైవాలు 'శ్రీ జగదాంబ దేవి, సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్'లు అని మల్లాపూర్ లంబాడ తండా అధ్యక్షుడు ఇస్లావత్ జీవన్ అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రం శివారులో శ్రీ జగదాంబ దేవి, సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గిరిజన తండా నాయకులు పాల్గొన్నారు.

బధిరుల సంఘం నూతన కార్యవర్గం

జగిత్యాల: బధిరుల సంఘం జగిత్యాల జిల్లా నూతన కార్యవర్గం ను మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సంజీవ్‌గౌడ్, శ్రీధర్, జనరల్ సెక్రటరీగా జగదీశ్వర్, జాయింట్ అండ్ స్పోర్ట్స్ సెక్రటరీగా దేవేందర్, జాయింట్ సెక్రటరీగా రమేశ్, ట్రెజరీగా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వివేక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాజేందర్, కార్తీక్, సాయికృష్ణ, మహేందర్, సుప్రియ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్, కొండయ్య వారికి అభినందనలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేకు నివాళి

మెట్‌పల్లి/మల్లాపూర్: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు నియోజకవర్గానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో, మల్లాపూర్ మండలంలోని రేగుంట శివారులో వృద్ధా శ్రమంలో మంగళవారం రామ్‌లు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లుకొమొరెడ్డి విజయ్ ఆజాద్, సంగు గంగాధర్, కంతి హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వార్డు ఆఫీసర్ మృతి

మెట్‌పల్లి: మున్సిపల్‌లో వార్డు ఆఫీసర్‌గా పని చేస్తున్న కట్ట హరీశ్(32) గుండెపోటుతో మరణించాడు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని గోల్ హనుమాన్ వాడకట్టుకు చెందిన హరీశ్ ఇటీవల వార్డు ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అవివాహితుడైన ఆయన సోమవారం అన్ని పనులు ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం మేల్కొనకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, అతనిలో చలనం లేదు. వెంటనే ఓ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల కమిషనర్ మోహన్, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సహకరించాలి



వ్యాపారితో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్

జగిత్యాలక్రైం: జగిత్యాల రైతుబజార్ వద్ద కూరగాయలు విక్రయించే రైతులు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా సహకరించాలని ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ అన్నారు. జగిత్యాల రైతు బజార్ ప్రాంతంలో ఆస్పత్రులతో పాటు వాణిజ్య సముదాయాలు, ప్రధాన రహదారి కావడంతో చాలా మంది కూరగాయలు విక్రయించే రైతులు రోడ్డుపై విక్రయాలు చేపడుతుండటంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎస్పీ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాల మేరకు మంగళవారం ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ రహదారికి ఇరువైపులా కూరగాయలు విక్రయించే రైతులతో మాట్లాడి రోడ్డుపై వెళ్లే వాహనాలకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కూరగాయలు విక్రయించుకోవాలని సూచించారు. రైతు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని కోరారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

బుగ్గారం: నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు వస్తాయని, రైతులు నకిలీ విత్తనాల బారిన పడి మోసపోకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాణ్యమైన విత్తనం–రైతున్నకు నేస్తం కార్యక్రమాన్ని చేపట్టిందని ధర్మపురి వ్యవసాయ సహాయ సంచాలకులు చిలుముల రాంచందర్ అన్నారు. మంగళవారం మండలంలోని శెకెల్ల గ్రామంలో స్థానిక రైతువేదిక ప్రాంగణంలో అభ్యుదయ రైతులకు వరి, పెసర విత్తనాలు పంపిణీ చేశారు. నాణ్యమైన విత్తనాలతో 10 నుంచి 15 శాతం అధిక దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే పరిశోధన స్థానాల ద్వారా ఉత్పత్తి చేసిన విత్తనాలను కొన్ని సాంకేతిక పద్ధతులను ఆచరించడం వల్ల రైతులు వాటిని తిరిగి రెండుమూడు సార్లు వాడుకోవచ్చని పేర్కొన్నా రు. వ్యవసాయ శాస్త్రవేత్త శోభ, ఏవో అక్షిత, ఏఈవోలు నవీద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐటీఐ కాలేజీలో మొదటి దశ అడ్మిషన్లు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మొదటి దశ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంట్యాల రవీందర్ తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఆగస్టు 2025 సెషన్ కోసం ఎన్సీవీటీ కేటగిరి కింద ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశం కోసం మొదటి దఫా అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 21 వరకు చివరి తేదీ అని, ITITELANGANA. GOV. IN లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో కంప్యూటర్ ఆపరేటింగ్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సులు ఉంటాయన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్లు ఇవ్వాలన్నారు.

రక్తదానం

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన మాలోవత్ మమత అనే మహిళకు అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరం ఉండటంతో మంగళవారం ధర్మాజీపేట గ్రామానికి చెందిన గుగ్లావత్ చిరంజీవి రక్తదానం చేసి మహిళ ప్రాణాలు కాపాడారు.చిరంజీవి 11వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందిస్తున్న సీఆర్‌పీలు

కథలాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను మంగళవారం ఎంఈవో శ్రీనివాస్ పంపిణీ చేశారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యను తెలుసుకుని దానికనుగుణంగా పాఠ్యపుస్తకాలు అందించినట్లు పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలనే ముందస్తుగా సరఫరా చేసినట్లు ఎంఈవో శ్రీనివాస్, సీఆర్‌పీలు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేములకుర్తిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010–11 లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం వేములకుర్తి పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు.